# ఓటరు స్లిప్పుల పంపిణీ వందశాతం చేపట్టాలి

జిల్లా ఎన్నికల అధికారి వివి గౌతమ్




3లో

ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 18 | మే | 2024
పేజీలు 7




# ప్రైవేటు ఫీజులపై.. నియంత్రణేది..!




- ఒక్కో పేరుకు ఒక్కో రకం ఫీజు
- విద్యా సేవ ముసుగులో అతి పెద్ద దోపిడీ
- బాహుబలి సెట్టింగ్‌లతో భవన నిర్మాణాలు
- చేష్టలూడిగిన విద్యాశాఖ
- విద్యా సంస్థల అధిపతుల అడుగులకు మడుగులు

2లో

రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రిస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు అపహాస్యం అవుతున్నాయి. ఇష్టానుసారంగా ఫీజులు నిర్ణయించి విద్యా సేవ ముసుగులో దోపిడీకి పాల్పడుతున్నారు. విద్యా సంస్థల నిర్వహణ, బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు అందుకు తగినట్లుగా ఫీజులు నిర్ణయిస్తే ఇబ్బంది లేదు. కానీ ఫీజు రూపంలో పిండుకోవడమే మా లక్ష్యం అన్న రీతిలో వ్యవహరిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోకపోతే ప్రైవేటు మోజులో ఉన్న కుటుంబాలు ఆస్తులు అమ్ముకోక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలకు రకరకాల పేర్లు పెట్టి పేరు పేరుకో ఫీజు నిర్ణయించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు.

-ప్రజాపక్షం/ఖమ్మం

# నిబద్ధతతో పని చేయండి




-ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యాచరణ
-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

వివరాలు 2లో..



# అనుమతులు లేని భవనాలపై చర్యలు

డిపివో ఆదేశాలు

2లో

# ఆయనపై అంత ప్రేమెందుకో..?

## అర్థం కాని రిజిస్ట్రేషన్ శాఖాధికారుల మతలబు






ప్రజాపక్షం/ఖమ్మం : రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్నతాధికారుల తీరు ఎవరికి అర్థం కాని స్థితి. ఎందుకు చర్య తీసుకుంటారో...? ఎందుకు ఉపసంహరించుకుంటారో ఆ శాఖలో ఉద్యోగులకే అర్థం కావడం లేదు. కొందరి పట్ల ఉదాసీన వైఖరి.

మిగతా 2లో..

# ప్రైవేటు ఫీజులపై .. నియంత్రణేది..?

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రిస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు అపహాస్యం అవుతున్నాయి. ఇష్టానుసారంగా ఫీజులు నిర్ణయించి విద్యా సేవ ముసుగులో దోపిడీకి పాల్పడుతున్నారు. విద్యా సంస్థల నిర్వహణ, బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు అందుకు తగినట్లుగా ఫీజులు నిర్ణయిస్తే ఇబ్బంది లేదు. కానీ ఫీజు రూపంలో పిండుకోవడమే మా లక్ష్యం అన్న రీతిలో వ్యవహరిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోకపోతే ప్రైవేటు మోజులో ఉన్న కుటుంబాలు ఆస్తులు అమ్ముకోక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలకు రకరకాల పేర్లు పెట్టి పేరు పేరుకో ఫీజు నిర్ణయించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విద్యా సంస్థల అధిపతుల్లో కొందరు రాజకీయ పక్షాలకు అంతరంగికులుగా ఉండి రాజకీయ నాయకుల ద్వారా రక్షణ పొందుతుంటే మరి కొందరు ఇతర మార్గాలను ఎంచుకుని తమ విద్యా సంస్థల వైపు అధికారులు కన్నెత్తి చూడకుండా చూసుకుంటున్నారు. ఫీజులకు సంబంధించి ఏ తరగతికి ఎంత ఫీజు నిర్ణయించాలి అనే దానిపై ఎక్కడ ప్రభుత్వ పరంగా నిబంధనలు రూపొందించబడలేదు. ఇది కొన్ని విద్యా సంస్థల అధిపతులకు వరంగా మారింది. ఇష్టానుసారంగా తామే తగ్గించినట్లు ఉదార వాదాన్ని చాటుకుంటున్నారు. ఇక మరికొన్ని విద్యా సంస్థలు విద్యార్థుల యూనిఫాం నుంచి పుస్తకాల వరకు విక్రయిస్తూ వ్యాపారాలను చేస్తున్నాయి. బయట మార్కెట్లో దొరుకుతున్న పుస్తకాల విలువ కంటే కొన్ని సంస్థలు రెట్టింపు వసూలు చేస్తున్నాయంటే ఆశ్చర్యం కలుగక మానదు. ప్రజల్లో ప్రభుత్వ విద్య పట్ల ఏర్పడిన నిర్లిప్తత ప్రభుత్వ సంస్థల్లో చదువుకుంటే తమ పిల్లలు వృద్ధిలోకి రారన్న అభద్రత భావం ప్రైవేటు విద్యా సంస్థల అధిపతులకు వరంగా మారింది. ప్రజల ఆలోచనే కోట్లు పోగేసిపెడుతుంది. ఒక సంస్థను స్థాపించి వాటి పేరుతోనే వివిధ ప్రాంతాల్లో కనీస వసతులు లేకుండా విద్యా సంస్థలను స్థాపించడం వాటికి రక రకాల ఫీజులు నిర్ణయించడం జరుగుతుంది. ఏ ప్రైవేటు పాఠశాలలో ఏ వసతులు ఉన్నాయి, ఎంత మేర ఫీజులు వసూలు చేస్తున్నారు, మౌళిక వసతుల కల్పన ఏవిధంగా ఉంది, సిబ్బంది పరిస్థితి ఏమిటి, బోధన సిబ్బందికి ఉన్న అర్హతలు ఏమిటి, వారికి అమలు చేస్తున్న వేతనాల పరిస్థితి ఏమిటని ఏనాడు విద్యాశాఖాధికారులు పరిశీలన చేసిన దాఖలాలు లేవు. చిన్న చిన్న ప్రైవేటు విద్యా సంస్థలను వెంటాడి వేటాడే మండల విద్యాశాఖాధికారుల నుంచి మొదలు జిల్లా విద్యాశాఖాధికారుల వరకు కార్పొరేట్ ఫీజులను తలపించే రీతిలో వ్యవహరిస్తున్న పెద్ద పెద్ద ప్రైవేటు విద్యా సంస్థల గురించి పట్టించుకున్న పరిస్థితి లేదు. పైపెచ్చు వారి విధానాలకు అడుగులకు విద్యాశాఖాధికారులు మడుగులు వత్తుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు సైతం ఈ ఫీజుల దోపిడీపై స్పందించడం



లేదు. ఎవరి పిల్లలు వారి ఇష్టం అనే భావన ఉండవచ్చు. కానీ ప్రజల తాపత్రాయాన్ని తమ పిల్లలు వృద్ధిలోకి రావాలన్న ఆరాటాన్ని సొమ్ము చేసుకుంటున్న సంస్థల పట్ల ఉదాసీన వైఖరి అవలంభించడం కూడా ప్రమాదకరమే. అది పాలనా పరమైన లోపం కూడా. నేను నా ఇష్టం వచ్చిన ఫీజు నిర్ణయిస్తాను దానిని చెల్లించ గలిగిన వారే మా సంస్థలో చేరతారని భీష్మించుకున్న విద్యా సంస్థల అధిపతుల పట్ల కూడా ఓసారి ఆలోచన చేయాల్సి ఉంది. ప్రైవేటు విద్యా సంస్థలు నిర్వహించే వసతి గృహాలు జైళ్లను మరిపిస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీధికో పాఠశాల దానికో పేరు పెట్టి పిండుకునే ఓ పెద్దమనిషి నిర్వహిస్తున్న సంస్థల్లో హాస్టల్స్ జైళ్లను తలపిస్తున్నాయని ఎవరైనా తల్లిదండ్రులు ఈ విషయమై ప్రశ్నిస్తే అసలు నా సంస్థలో సీటే లేదంటే బతిమిలాడి చేర్పావు నీకు ఇష్టం లేకపోతే తీసుకెళ్లు అంటూ బెదిరిస్తున్నారని తల్లిదండ్రులో వాపోతున్న ఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా మారిన పరిస్థితులు ప్రైవేటు సంస్థలకు పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య వీటన్నింటి దృష్ట్యా ఫీజుల నియంత్రణ పై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. ఇదే సమయంలో బాహుబలి సెట్టింగ్‌లను మరిపించే రీతిలో భవనాల నిర్మాణం చేస్తున్న సంస్థల వైపు మిగిలిన శాఖల అధికారులు కూడా కన్నెత్తి చూడడం లేదంటే ఏ స్థాయిలో విద్యా సంస్థల అధిపతులు అధికారులను లోబర్చుకుంటున్నారో అవగతమవుతుంది. ఈ బాహుబలి సెట్టింగ్‌లకు అనుమతులు ఉన్నాయా...? ఉంటే ఏ మేరకు ఉన్నాయి...కూడా అధికారులు పరిశీలన చేయాల్సి ఉంది. అడ్మిషన్ల పేరుతో వెలసిన ఫ్లెక్సీలపై జిల్లా కలెక్టర్ తీవ్ర హెచ్చరికలు చేసినా తీరు మారలేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. గుత్తాధిపత్యంగా వ్యవహరిస్తున్న ఒక విద్యా సంస్థ తీరు తెన్నులపైన అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కోరుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు మాటలుగా మిగిలిపోకుండా చేతలుగా రూపు దిద్దుకోవాలని జలగల్లా పీడిస్తున్న విద్యా సంస్థల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# నిబద్ధతతో పని చేయండి

**ప్రజాపక్షం/ ఖమ్మం / పాల్వంచ :** కమ్యూనిస్టు పార్టీలో చేరిన ప్రతి కార్యకర్త నిబద్ధతతో పని చేస్తూ నిత్యం ప్రజలతో మమేకమవుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని భద్రాద్రి కొత్తగూడెంజిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా కోరారు. ఇటీవల పార్టీలో చేరిన వారికి శుక్రవారం పార్టీ ప్రాథమిక సభ్యత్వాలను ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాషా మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సహకారంతో నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడే ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనని పాషా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు, మండల కార్యదర్శి పూర్ణచందర్‌రావు, నాయకులు బండి నాగేశ్వరరావు, రాహుల్, శ్రీనివాసరావు, పాషా, జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని భవనాలపై చర్యలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అనుమతులు లేకుండా తల్లాడ పట్టణంలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైంది. తల్లాడ మేజర్ పంచాయితీలో ఎటువంటి అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టగా మండల అధికారులు బహుళ నిర్మాణ దారులకు యథేచ్ఛగా సహకరిస్తున్నారు. భవన నిర్మాణాలకు సంబంధించి అనుమతులు తీసుకున్నారా లేదా అనే విషయాన్ని గ్రామ పంచాయితీ అధికారులు కానీ, మండల అధికారులు కానీ కనీస పరిశీలన చేయడం లేదు. మండల అధికారుల సహకారంతోనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో అక్రమ నిర్మాణాలపై జిల్లా పంచాయితీ అధికారి దృష్టి సారించారు. ఇందుకు సంబంధించి డిపివో హరికిషన్ అక్రమ భవన నిర్మాణాలపై విచారణ చేయాలని డిఎల్‌పివో ప్రభాకర్ రావును ఆదేశించారు. నూతన పంచాయితీల చట్టం ప్రకారం అక్రమ నిర్మాణాలకు సంబంధించి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశాల్లో పేర్కొన్నారు. జిల్లా పంచాయితీ శాఖాధికారులు భవన నిర్మాణాలకు సంబంధించి విచారణ చేపడితే మండల అధికారుల నిర్లక్ష్యంతో పాటు అక్రమ నిర్మాణాల బాగోతం బయట పడుతుంది. త్వరితగతిన విచారణ జరిపించాలని తల్లాడ పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఎంఎల్‌సి ఎన్నికలకు కాంగ్రెస్ సమన్వయకర్తల నియమాకం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఆయా నియోజక వర్గ కో ఆర్డినేటర్లను నియమించింది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో 10 శాసన సభ నియోజక వర్గాలకు సంబంధించి అక్కడ ప్రాతినిథ్యం వహిస్తున్న శాసన సభ్యులనే కో ఆర్డినేటర్లుగా నియమించింది. కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా వ్యవహరిస్తున్న సిపిఐ శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావును కొత్తగూడెం నియోజక వర్గ కో ఆర్డినేటర్లుగా ఎంపిక చేసింది. మధిరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఖమ్మంకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరుకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని నియమించారు. ఇల్లందుకు శాసన సభ్యులు కోరం కనకయ్య, వైరాకు మాలోత్ రాందాస్ నాయక్, సత్తుపల్లికి మట్టా రాగమయి, అశ్వారావుపేటకు జారే ఆదినారాయణ, భద్రాచలంకు తెల్లం వెంకట్రావును కో ఆర్డినేటర్లుగా నియమించింది.

# ఆయనపై అంత ప్రేమెందుకో..?

**(మొదటిపేజీ తరువాయి)**

మరి కొందరి పట్ల కఠిన నిర్ణయాలు తీసుకోవడం చర్చకు తావిస్తుంది. వైరా రిజిస్ట్రేషన్ కార్యాలయం పై ఆరోపణలు వచ్చిన సందర్భంలో అక్కడ అటెండర్‌గా పనిచేస్తున్న దుస్సా కృష్ణ అనే వ్యక్తిని భద్రాచలంకు బదిలీ చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇంతలోనే ఏమి జరిగిందో కాని భద్రాచలంలో ఉన్న దుస్సా కృష్ణను వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బాధ్యతలు అప్పగించారు. కృష్ణ అనే ఉద్యోగి అవకతవకలకు పాల్పడుతున్నారని బదిలీ చేసిన ఉన్నతాధికారులు ఇప్పుడు సచ్చీలుడని ముద్ర వేసి వైరాకు బదిలీ చేశారా లేక పైరవీ ప్రభావమా అన్నది అర్థం కావడం లేదు. ఖమ్మం జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలో ఐదేండ్ల పరిస్థితులను గమనంలోకి తీసుకుంటే అవకతవకలకు పాల్పడడం, విధుల నుంచి తప్పించడం, కొన్ని నెలల్లో పోస్టింగులు ఇవ్వడం ఒక సాధారణ ప్రక్రియగా మారిపోయింది. ఏమి చేసినా పోతే ఉద్యోగం పోతుంది మళ్లీ కొద్ది నెలలకు అదే వస్తుంది అన్న భావన జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలో రోజు రోజుకు బలపడుతుంది. ఉదాసీన వైఖరి అవినీతికి, అక్రమ రిజిస్ట్రేషన్లకు కారణమవుతుంది. పలువురు సస్పెండ్ అయిన సబ్ రిజిస్ట్రార్లు ఇదే జిల్లాల్లో యథేచ్ఛగా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ తీరు తెన్నులు పలు విమర్శలకు తావిస్తున్నాయి. వైరాలో బదిలీ అయిన ఉద్యోగి కొద్ది రోజుల్లోనే తిరిగి అక్కడికే వచ్చి విధులు నిర్వహించే పరిస్థితి ఏర్పడిందంటే ఆ శాఖలో ఏమి జరుగుతుందో అవగతమవుతుంది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా దీనిపై పూర్తి విచారణ జరిపాలని అక్రమ రిజిస్ట్రేషన్లు, అవినీతిని నిరోధించాలని , విధుల పట్ల నిర్లక్ష్యం వహించి అక్రమాలకు పాల్పడే అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# లైసెన్స్ ఉన్న షాపు వద్దే విత్తనాలు కొనుగోలు చేయండి

**మండల వ్యవసాయాధికారి బాలాజీ**

**ప్రజాపక్షం/కొణిజర్ల :** రైతులు విత్తనాలు కొనుగోలు చేసేవిషయంలో జాగ్రత్తలు పాటించాలని లైసెన్స్ కలిగిన షాపులవద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు ప్యాకింగ్ లేకుండా , కంపెనీ పేరు లేకుండా మామూలు గుడ్డ సంచిలో ఉంచి ఇవి అధిక దిగుబడి వస్తాయని చెపితే వాటిని కొనొద్దని తెలిపారు. తెలంగాణా రాష్ట్రం కు సంబంధించిన విత్తన దుకాణాలవద్ద తీసుకుంటే విత్తనం మొలకెత్తకపోయినా , సరిగా పూత రాకపోయినా వారి మీద మనం ఫిర్యాదు చేయ




డానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అదే వేరే రాష్ట్రంలో కొనుగోలు చేస్తే వాటికి సంబందించి ఆరాష్ట్రంలోని వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని వివరించారు. అక్కడ క్వాలిటి కంట్రోల్ కి ఇక్కడ వ్యవసాయాధికారులకు ఎలాంటి సంబం దం ఉండదని పేర్కొన్నారు. కాబట్టి మన రాష్ట్రంలోనే విత్తనాలు కొనుగోలు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. ద్విచక్రవాహనాలపై లేదా కార్లలో వచ్చి విక్రయించే విత్తనాలు కొనుగోలు చేయొద్దని తెలిపారు. పత్తి , మిరప విత్తనాలు కొనేసమయంలో ఆరకం ఇంతకుముందు ఎక్కడ ఎంత పండింది రైతుల ద్వారా కాని వ్యవసాయాధికారులద్వారా కాని వివరాలు తెలుసుకోవాలని సూచించారు. విత్తనంతోపాటు రశీదు కూడా తీసుకోవాలని ఆ రశీదులో రైతు సంతకంతోపాటు విత్తన దుకాణదారు (డీలర్) సంతకం కూడా ఉండాలని అన్నారు. యూట్యూబ్‌లో దిగుబడి గురించి పెట్టే వీడియోలను నమ్మొద్దని అన్నారు.

## పంట అవశేషాలు తగలబెట్టొద్దు

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** పంట అవశేషాలను తగలబెట్టడం వలన భూమిలో ఉన్న ఉపయోగరమైన సూక్ష్మ జీవులు చనిపోవడంతో పాటు సేంద్రియ కర్బనం కూడా దెబ్బతింటుందని ఏఓ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలంలోని గుదిమళ్ళ గ్రామంలో పంటలను తగలబెట్టిన పొలాలను సందర్శించారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతులు పంట కోతలు పూర్తయిన తర్వాత తగలబెట్టడం వలన భూమిలో సేంద్రియ పదార్థం తిరిగి నేల గుల్లబారుతుందన్నారు. ఎకరం పంట అవశేషాలను కలియదున్నడం ద్వారా 36.8శాతం కార్బన్, నత్రజని 1శాతం, భాస్వరం 0.06శాతం భూమిలో కలుస్తుందన్నారు. అదేవిధంగా ఒక ఎకరంలోని వరి పంట అవశేషాలను కాల్చడం ద్వారా 920,2.25కేజీల సేంద్రియ కర్బనం, 25,37.5 కేజీల నత్రజని, 1.5,2.5 కేజీల భాస్వరం, 62.5,93.75 కేజీల పొటాష్ గాలిలో కలిసిపోతుందన్నారు. కావున రైతులు పంట అవశేషాలను తగలబెట్టకుండా భూమిని కలియదున్నాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

## వంతెన నిర్మాణ పనులు నిలిపేయాలంటూ మావోయిస్టు హుకుం

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని బిజాపూర్ జిల్లా భైరాంఘడ్ ప్రాంతంలో నిర్మిస్తున్న వంతెన పనులను నిలిపేయాలని మావోయిస్టులు హుకుం జారీ చేశారు. ఈ మేరకు ఆ ప్రాంతంలోని చెట్లు, భవనాలకు పోస్టర్లు అంటించడంతో పాటు కరపత్రాలు విడిచారు. మావోయిస్టుల లేకుండా చేయాలని ఉద్దేశ్యంతో పాటు అడవుల్లో అపారంగా లభించే ఖనిజ సంపదను ప్రభుత్వం దక్కించుకునేందుకు చేస్తున్న కుట్రలో భాగంగానే ఈ నిర్మాణాలు సాగుతున్నట్లు మావోయిస్టులు ఆరోపించారు. అమాయక ఆదివాసీలను మావోయిస్టుల పేరిట ప్రభుత్వ బలగాలు పొట్టన పెట్టుకుంటున్నాయని మావోయిస్టు దండ కారణ్య జోనల్ కమిటి, భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామరాజు జిల్లా మావోయిస్టు కమిటీ పేరిట లేఖలు విడుదలైన మరుసటి రోజే మావోయిస్టు పార్టీ నిర్మాణాలపై స్పందించింది.

# ఓటరు స్లిప్పుల పంపిణీ వందశాతం చేపట్టాలి

**జిల్లా ఎన్నికల అధికారి విపి గౌతమ్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్పుల పంపిణీ 100 శాతం చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. శుక్రవారం నూతన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆర్డీవోలు, తహసీల్దార్లతో పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికల నిర్వహణ, ధరణి పెండింగ్ దరఖాస్తుల పై కలెక్టర్ విపి గౌతమ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటరుకు తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలియాల్సిన అవసరం ఉందని ఈ దృష్ట్యా ఓటరు స్లిప్పుల పంపిణీ నమోదైన ప్రతి ఓటరుకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ సంబంధిత బిఎల్‌వోల ద్వారా చేపట్టాలని ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటలకు పంపిణీ పురోగతిపై నివేదిక సమర్పించాలన్నారు. ఎంఎల్‌సి ఉప ఎన్నికలకు బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేయాలని ఏమైనా చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో మొదటి విడత శిక్షణ ఈనెల 20న, రెండో విడత శిక్షణ ఈనెల 26న చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 26న డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ సామాగ్రిని తీసుకుని సంబంధిత పోలింగ్ కేంద్రానికి వెళ్లి అక్కడే బస చేయాలన్నారు. రిసెప్షన్ కేంద్రం నల్గొండలోని నాగార్జున కళాశాలలో ఉంటుందని ఈనెల 27న పోలింగ్ అనంతరం నేరుగా రిసెప్షన్ కేంద్రానికి పోలీస్ ఎస్కార్ట్ తో వెళ్లాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 15 రూట్లు ప్రతి రూటుకు రూట్ ఆఫీసర్‌ను నియమించామన్నారు. తహసీల్దార్లు సెక్టార్ అధికారులుగా, నయబ్ తహసీల్దార్లు ఫ్లయింగ్ స్క్వాడ్‌గా, ఆర్ఐలు ప్రత్యేక వీడియో టీములుగా నియమించినట్లు తెలిపారు. శుక్రవారం నుండి వారు తమ విధుల నిర్వహణ చేపట్టాలని ఆయన తెలిపారు. ప్రత్యేక వీడియో టీమ్‌కు వీడియో గ్రాఫర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. ఓటింగ్ విధానం పై ఓటర్లకు అవగాహన కలిగేలా విస్తృత ప్రచారం చేపట్టాలని ఓటింగ్ విధానం చేయదగినవి, చేయకూడని పనులపై ఫ్లెక్సీ రూపొందించి పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్‌ను అనుమతించవద్దని ఆయన తెలిపారు. ఇండిలిబుల్ ఇంక్ ఎడమ చేతి మధ్య వేలుకు పెట్టాలన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలన్నారు. ప్రతి రోజు తహసీల్దార్లు కనీసం 20 ఫైళ్లు సమర్పించాలన్నారు. రిజిస్ట్రేషన్లలో పెండింగ్ స్లాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, డిఆర్‌డివో సన్యాసయ్య, ఎం. రాజేశ్వరి, ఏడి సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ శ్రీనివాసులు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్లు మదన్‌గోపాల్, అనురాధ బాయి, రాంబాబు, సత్యనారాయణ, ఓఎస్‌డి నాగేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలి

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈనెల 27న జరగనున్న నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులతో జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పువ్వాళ్ల మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుంచి జర్నలిస్టుగా మంచి పేరు తెచ్చుకున్న తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ గుర్తించి పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా అధిష్టానం నియమించడం సంతోష కరమన్నారు. ఈనెల 27న జరిగే ఎంఎల్‌సి ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను గెలిపించేందుకు మండల అధ్యక్షులు కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న పట్టభద్రులను గుర్తించి నాయకులు, కార్యకర్తలు తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటేసే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతి మండలంలో సీనియర్ నాయకులతో, అనుబంధ సంఘాల అధ్యక్షులతో, ముఖ్య నాయకులతో, గ్రామ కాంగ్రెస్ నాయకులతో సమావేశాలు నిర్వహించి ఎంఎల్‌సి ఎన్నికలకు సన్నద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, గాలి దుర్గారావు, కొమ్మినేని భూక్యా, బాలాజీ, మాలోత్ మంగీలాల్ నాయక్, తలారి చంద్ర ప్రకాష్, స్వర్ణ నరేందర్, కాపా సుధాకర్, శివ, వేణు, కాసర చంద్ర శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం డిపో ఎదుట సంబురాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆర్టిసి ఖమ్మం డిపో ఎదుట ఉద్యోగులు సంబురాలు నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఖమ్మం రీజియన్ పరిధిలోని ఖమ్మం డిపో అత్యధిక ఆదాయం అర్జించిన సందర్భంగా శుక్రవారం డిపో మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది సంబురాలు నిర్వహించారు. ఈ సంబురాల్లో భాగంగా ఆర్టిసి సంస్థ ఎండి ఆదేశాల మేరకు ప్రతి ఉద్యోగికి స్వీట్లు పంపిణీ చేశారు. ఖమ్మం రీజినల్ మేనేజర్ సిహెచ్ వెంకన్న ఆధ్వర్యంలో ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాస్ నేతృత్వంలో ఖమ్మం డిపోకు సంబంధించి 3.12 లక్షల కిలో మీటర్లు తిప్పి రెండు కోట్ల ఆదాయాన్ని, 99 శాతం ఓఆర్‌తో ఖమ్మం రీజియన్ పరిధిలో మొదటి స్థానంలో నిలిచింది. ఈనెల 14న 109 శాతం, 15న 105 శాతం, 16న 104 శాతం ఆక్యుపెన్సీ తో రీజియన్‌లోనే మొదటి స్థానంలో నిలవడం జరిగిందని డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ విజయంలో ప్రతి ఒక్క ఉద్యోగి పాత్ర ఉందని డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర అభినందనీయమన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా 70 బస్సులను హైదరాబాద్ సిటీ నుంచి తీసుకువచ్చి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రహదారిపై కళేబరం తొలిగింపు

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండలం చెన్నూరు లింగాల మధ్య గుర్తుతెలియని వాహనం ఢీకొని పాడి గేదే మృతి చెందింది. దీనివలన రోడ్డుపైనే మూడు రోజులపాటు ఉండటంతో అదే రహదారిపై పలు గ్రామాల వాహనదారులు, ప్రయాణికులకు తరచూ అడ్డు రావడం, దుర్వాసన పడటంతో ప్రజాపక్షం వార్త దినపత్రిక లో ప్రచురితం కావడంతో ఆర్ అండ్ బి శాఖ అధికారులు స్పందించి పశు కళేబరాన్ని తొలగించారు .ఈ సందర్భంగా ప్రయాణికులు బాటసారులు రాకపోకలు చేస్తున్న వారందరూ ఆర్ అండ్ బి శాఖ అధికారులకు ధన్యవాదములు తెలిపారు.




# స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రత



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఈవిఎం యంత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ గ్రామంలోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల భవనంలో ఈవిఎం యంత్రాలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్స్ నలువైపులా కేంద్ర సాయుధ బలగాలు, జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రతతో పాటు నిరంతర సిసి కెమెరాల పర్యవేక్షణలో పటిష్టమైన రక్షణ ఉందని పోలీస్ కమిషనర్ తెలిపారు. లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు కూడా తావు లేకుండా పోలీస్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతూ సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి మౌనిక, ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి, సిఐ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నను ఆశీర్వదించండి

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** నిత్యం ప్రజల సమస్యలపై తన కళం,గళం ద్వారా గత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజలకు అండగా నిలిచిన జర్నలిస్ట్ తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీగా ఆశీర్వదించాలని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ ఖాదర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో మల్లన్న పాత్ర కీలకమైందన్నారు. ఈ క్రమంలో నిర్బంధాలు, దాడులు ఎదుర్కొని ప్రజలపక్షాన పోరాడారన్నారు. గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఖమ్మం,నల్గొండ , వరంగల్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిందన్నారు. కావున ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తీన్మార్ మల్లనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అన్ని వర్గాల ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్యం బతకాలన్న..రాజ్యాంగం అమలు జరగాలన్న కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు.

# రక్తపోటుపై అవగాహన కలిగి ఉండాలి



**ప్రజాపక్షం/ తల్లాడః** రక్తపోటుపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రత్న మనోహర్ తెలిపారు. ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రక్తపోటు ఉన్న వారిలో తలనొప్పి, వాంతులు, చాతిలో నొప్పిగా ఉండటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కళ్లు మసకబారటం, ఆందోళనగా ఉండటం, చెవులలో శబ్దం రావటం తదితర లక్షణాలు ఉంటాయని, ఇలాంటి లక్షణాలు ఉన్న వారు వెంటనే స్థానిక వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు. రక్తపోటు నివారణకు సరైన ఆహార అలవాట్లు పాటించాలని, వ్యయామం చేయాలని, వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది పెద్ద పుల్లయ్య, మేరమ్మ, వసంతకుమారి, భద్రమ్మ, కళావతి, కుమారి, రాజశ్రీ, సంజయ్, కృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధిక రక్తపోటు.. ఆరోగ్యానికి చేటు



**ప్రజాపక్షం/కల్లూరుః** అధిక రక్తపోటు, ఆరోగ్యానికి చేటు అని కల్లూరు వైద్యాధికారి నవ్య కాంత్ తెలిపారు. కల్లూరు లో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగాబాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. మండలంలో 5400 మంది బిపి రోగులు ఉన్నారని వారందరికీ శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూత్రాలను వివరించారు. వయసుతో సంబంధం లేకుండా బిపి వస్తుందని, మానసిక ఒత్తిడి, ఆహారపు అలవాట్లు, శరీర శ్రమ లేకపోవడం, తగినంత వ్యాయామం సమతూల్య ఆహారం మనసు ప్రశాంతంగా ఉంచడం క్రమం తప్పకుండా మందులు వాడాలని లేనిచో గుండెపోటు, పక్షవాతం, కిడ్నీ, కంటి సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, బిపి రోగులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బిపి రోగులతో పాటు ఆసుపత్రి సిబ్బంది, పర్యవేక్షకులు, ఆశాలు పాల్గొన్నారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

## పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయండి




**ప్రజాపక్షం/కల్లూరు:** ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు మెరుగుపరిచేందుకు మంజూరైన నిధుల ద్వారా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ డి ఈ రాంబాబు ప్రధానోపాధ్యాయులను, గ్రామ సమాఖ్యలను కోరారు. కల్లూరు లోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ సమాఖ్యలు ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పంచాయతీరాజ్ డిఇ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలలలో 36 పాఠశాలలలో కోటి పది లక్షలు నిధులుతో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు, ప్రహరీ, తరగతి గదులు ఆధునికీకరణ, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం, రన్నింగ్ వాటర్ లాంటి సౌకర్యాలు మెరుగుపరిచేందుకు నిధులు మంజూరు కావడం జరిగిందని ఆ మొత్తాన్ని వాటి ద్వారా పనులన్నీ పూర్తి చేసి పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు పూర్తిస్థాయిలో అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి దామోదర ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, గ్రామ సమాఖ్యలు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న వేసవి ఉచిత శిక్షణ శిబిరం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మినీ స్టేడియంలో 16 సంవత్సరముల లోపు ఉన్న బాల బాలికలకు జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో మే ఒకటో తేదీ నుండి 31 తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతుందని, ఈ శిబిరంలో భాగంగా పాల్గొనే క్రీడాకారులు పాల్గొనవచ్చని, దీనిలో శిక్షణ పొంది నైపుణ్యం కనబరిస్తే జిల్లా రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని ఇప్పటికే వాలీబాల్ అంశం నందు 22 మంది విద్యార్థులు, బాల్ బ్యాడ్మింటన్ క్రీడనందు 18 మంది క్రీడాకారులు, అథ్లెటిక్స్ అంశమునందు 20 మంది క్రీడాకారులు, కబడ్డీ నందు 24 మంది క్రీడాకారులు శిక్షణ పొందడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంకనూ ఆశక్తి కలవారు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొని నైపుణ్యాన్ని పొందాలని వ్యాయామ ఉపాధ్యాయులు వీర రాఘవయ్యలు కోరారు. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

## ఘనంగా భక్తాంజనేయ స్వామి దేవాలయంలో సీతానవమి ఉత్సవాలు



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల కేంద్రంలోని గ్రామంలో తొలిసారిగా విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా సీతానవమి ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని గర్భిణీ స్త్రీలకు సీమంతాలు చేశారు. ఈకార్యక్రమంలో ములకలపల్లి ప్రధాన ఆచార్యులు ముకుందల సత్యనారాయణ శాస్త్రి, రమాదేవి దంపతులు, ఎంపిటిసి మెహర్ మని, మండలం మహిళా సంఘం అధ్యక్షులు జయశ్రీ, మహిళా భక్తులు, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షులు కారపూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పువ్వల శ్రీనివాసు, ఆంజనేయు స్వామి దేవాలయం వైస్ చైర్మన్ బిక్కమల్ల సుధాకర్, రిపోర్టర్ శేషగిరి, యువ నాయకులు మిరియాల అవినాష్, జిల్లా సామాజిక సమరసత ప్రముఖ గొడ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.ఫోటో రైటఫ్:03

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి పోటీ



**ప్రజాపక్షం/చండ్రుగొండ:** చండ్రుగొండ తెలుగుదేశం పార్టీ మండల కమిటీ సమావేశం వారిధి సత్యనారాయణ అధ్యక్షతన ఆయన ఇంటి వద్ద ఏర్పాటు చేశారు. ఈసమావేశానికి అశ్వారావుపేట తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కట్రం స్వామి దొర ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ చండ్రుగొండ మండలంలో స్థానిక సంస్థల్లో అధిక గ్రామ పంచాయితీలు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసి పోటీ చేయాలని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజాసమస్యల కొరకు పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో చాపలమడుగు వెంకటేశ్వర్లు, సిహెచ్ కిరణ్, వెంకటి కృష్ణార్జునరావు, కోటేశ్వరరావు, కుంజ పరమేశ్వరరావు, కోడుమూరు సత్యనారాయణ, కిలారి ప్రసాద్, బద్దం వెంకటి, పి మోహన్‌రావు, కుంజ మోహన్‌రావు, శేఖర్, నేక్కడ రామారావు, ఆకుల సత్యనారాయణ, వేతి సోమయ్య, సున్నం శోభన్, ఇస్లావత్ కిషన్, మదర్ షాప్, లాల్ అహ్మద్, గోసుల పెదరాయుడు, జంగా శ్రీనివాసరెడ్డి, సిహెచ్ కిరణ్, సిద్ధిని సీతారాములు, పొడిచేటి వెంకటాచారి, ఎస్‌కే బాబు, జహీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి తవ్వకాలపై ఇంటెలిజెన్స్ ఆరా..!

**- ప్రజాపక్షం కథనంతో అధికారులు వివరాల సేకరణ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైన ప్రజలు**




**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని పోలిశెట్టిగూడెం గ్రామంలో గల ఓ గుట్ట నుంచి గత రెండునెలల నుంచి అనుమతుల మాటున జరగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై ప్రజాపక్షం శుక్రవారం కథనాన్ని ప్రచురించింది. ఇది సామాజికి మాధ్యమాల వేదికగా పలు వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడంతో పాటు మండల వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. అక్కడ జరుగుతున్న పర్యావరణ విధ్వంసాన్ని అక్షరరూపం అందించి వెలుగులోకి తీసుకువచ్చినప్పటికీ రెవిన్యూ, మైనింగ్‌శాఖలు మాములుగా తీసుకుంటున్నారు. కనీసం ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తుంది. రెండు నెలలు పార్లమెంట్ ఎన్నికల్లో నిమగ్నమైన అధికారులు ఇప్పటికైనా పాలనపై దృష్టి పెట్టకపోవడంపై ప్రజలు పెదవివిరుస్తున్నారు. కాగా ఈ వ్యవహారంపై ఇంటిలిజెన్స్ ఆరా తీసినట్లుగా తెలిసింది. మట్టి తవ్వకాలలో అనుమతులకు తీలోదాకాలు ఇచ్చినట్టుగా నివేదిక సిద్ధం చేసినట్టు సమాచారం. ఇదిలా ఉండగా జరుగుతున్న పర్యావరణ విధ్వసం,గ్రామానికి పొంచి ఉన్న ముప్పుపై జిల్లా కలెక్టర్ వీ.పీ గౌతమ్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు ప్రజాపక్షానికి ప్రజలు వివరించారు.

## ఉపాధి పనులను పరిశీలించిన అడిషనల్ డిఆర్‌డిఓ



**ప్రజాపక్షం/కామేపల్లి:** మండలంలోని జాస్తిపల్లి, ముచ్చర్ల గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను అడిషనల్ డిఆర్డివో బి శిరీష ఆకస్మికంగా శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఉపాధి హామీ కూలీలతో ఆమె మాట్లాడుతూ పనికి వచ్చే కూలీలకు రోజుకి 300 రూపాయలు వచ్చే విధంగా పని చేసుకోవాలని సూచించారు. అదే విధంగా పని చేసే ప్రదేశంలో కూలీలతో సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకుని, సంతృప్తి వ్యక్తం చేశారు. కూలీలకు పనికి తగిన వేతనం వస్తుందా అని ప్రశ్నించగా కచ్చితంగా మేము చేసిన పనికి మాకు వేతనాలు అందుతున్నాయని కూలీలు ఆమెకు తెలిపారు. ఈ ఉపాధి హామీ పని వలన మేము మా గ్రామాలలో ఉంటూ, వలసలు పోకుండా విజయవాడ, హైదరాబాద్ పనుల నిమిత్తం పోకుండా మాకు ఎంతో ఉపయోగకరంగా ఉందని కూలీలు తెలియజేశారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కూలీ కుటుంబాలకు అర్హతలను బట్టి ఉన్నత ద్వారా కూలీలు ఎంచుకున్న రంగంలో ట్రైనింగ్ ఇచ్చి వాళ్ల స్వయం ఉపాధి కల్పించబడుతుందని వివరించారు. ఈకార్యక్రమంలో ఏపీవో శ్రీరాణి, ఈసి వెంకటేశ్వర్లు, పంచాయితీ కార్యదర్శులు రవి, రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్, డేవిడ్ రాజ్, బావ్‌సింగ్, ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబు, మంజుల, మెట్లు, వీరన్న, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## చలో బస్ భవన్‌ను విజయవంతం చేయండి

**- ఇయూ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణి**



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఈ నెల 21వ తేదిన హైదరాబాద్‌లో జరిగే ఛలోబస్ భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిఎస్ ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం రీజియన్ నాయకులు మాచర్ల సుందరం, భద్రాచలం డిపో కార్యదర్శి బర్ల రమణారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక డిపో ఆవరణలో సిబ్బందికి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ గత ప్రభుత్వం 90 శాతం పూర్తి చేసిందని, మిగిలిపోయిన 10 శాతం ప్రక్రియను ఈ ప్రభుత్వం పూర్తి చేసి వెంటనే అపాయింట్‌మెంట్ తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2013 ఆర్‌పిఎస్‌కు సంబంధించిన బాండ్ 50 శాతం బకాయిలను కేవలం డ్రైవర్లకు మాత్రమే చెల్లించారని, మిగితా కేటగిరీలకు సంబంధించిన ఉద్యోగులందరికీ వెంటనే చెల్లించాలని, రాజ్యాంగం కల్పించి ట్రేడ్ యూనియన్ హక్కులను కాపాడటంతో పాటు ఆర్‌టిసిలో యూనియన్లను వెంటనే అనుమతించాలన్నారు. వివిధ కారణాలతో సస్పెండ్, రిమూ అయిన ఉద్యోగుల కేసులను వెంటనే పరిశీలించి విధుల్లోనికి తీసుకోవాలని, పెంచిన అధిక పనిభారాన్ని తగ్గించాలని, వివిధ నియామకాల ప్రక్రియ వెంటనే మొదలు పెట్టాలని, ఎస్ఆర్‌బిఎస్, ఎస్‌బిటి, సిసిఎస్, పిఎఫ్ లకు సంబంధించిన బకాయిలు వెంటనే చెల్లించాలని, మహిళా కండక్టర్లు రాత్రి 8 గం.లోపు డ్యూటీ దిగేలా చూడాలని, మహాలక్ష్మి పథకం స్కీం విషయంలో సంస్థకు చెల్లించే డబ్బుల విషయంలో ప్రభుత్వం ఒక రకంగా, యాజమాన్యం ఒక రకంగా చెప్పడం మానుకోవాలని, తక్షణమే వాస్తవాలను కార్మికులు, ప్రజలకు తెలియజేయాలని, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు కొనుగోలు చేయాలని, కార్మికులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. యూనియ్లకు అతీతంగా ఛలోబస్ భవన కార్యక్రమాన్ని జయప్రధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం వెంకన్న, కే రాజేష్, ఈఎస్ కుమార్, ఆర్ఎస్ భూషణం తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి అదనపు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 24 నుండి జూన్ 3వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు అవుతాయని, ఉదయం 9 గం. నుండి మధ్యాహ్నం 12 గం. వరకు ప్రథమ స.ం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 గం. నుండి సాయంత్రం 5 గం. వరకు ద్వితీయ సం. విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద మౌళిక సదుపాయాలు కల్పించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. మొత్తం 2726 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచనరాణి, జిల్లా వైద్యాధికారి డా.శిరీష, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ట్రైన్లకు జనరల్ బోగీలు పెంచాలని సిపిఐ వినతి



**ప్రజాపక్షం/ మధిర :** ట్రైన్లల్లో ప్రయాణించే ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారి సౌకర్యార్థం జనరల్ బోగీలను పెంచాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో ప్రతిరైలుకు ఆరు జనరల్ బోగీలను కేటాయించాలని కోరుతూ ఖమ్మం రైల్వేస్టేషన్ సూపరిండెంట్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనరల్ బోగీలు తక్కువగా ఉండటం వలన విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, కూలీలు తదితర ప్రయాణీకులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైల్వేశాఖకు కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్నా ప్రయాణీకుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ట్రైన్లల్లో వేలాది మంది ప్రయాణీస్తున్న ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జనరల్ బోగీలను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే కరోనా సమయంలో తొలగించిన రాయతీలను కూడా ఇంతవరకు పునరుద్ధరించలేదని, గతంలో మాదిరిగా టికెట్ల రేట్లను తగ్గించాలని, అన్ని రాయితీలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వర్లు, పోటు కళావతి, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, రావి శివరామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు గాదె లక్ష్మి నారాయణ, ఇటికాల రామకృష్ణ, తాటి నిర్మల, నంబూరి శంకరావు, మేకల రవి, మధిర మండల కార్యవర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి బరిలో మిమిక్రీ రమేష్



**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టభద్రుల ఎంఎల్‌సి స్వతంత్ర అభ్యర్థిగా మిమిక్రీ రమేష్ (జన్నారపు రమేష్) భరిలో ఉండనున్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఆయన శ్రీ సీతారామ చంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తనకు అన్ని పార్టీల పెద్దలు సుపరిచితులే అని, ఆయా పార్టీల నుండి ఎంఎల్‌సి టిక్కెట్ ప్రయత్నం చేయవచ్చుగా అని మిత్రులు అడుకుతున్నారని చెప్పారు. తాము మిమిక్రీ రమేష్‌గా అందరికీ సుపరిచితుడనని, ఈ ప్రాంతంతో పాటు దేశ విదేశాల్లో తనను అభిమానించే వారు ఉన్నారని చెప్పారు. తాను ఏదో ఒక రాజకీయ పార్టీ అనుసందానంగా పోటీ చేస్తే తనను కూడా అందరితో ఒకే గాటికి కట్టేస్తారని, అదే స్వతంత్ర అభ్యర్థిగా భరిలో ఉంటే అదరి అభిమానంతో పాటు పట్టభద్రుల ఓట్లు దక్కుతాయని చెప్పారు. పట్టభద్రున్నైన తనకు నిరుద్యోగం తాలూకా బాధ తెలుసని, ఏ ఉద్యోగం రాకనే మిమిక్రీ కళాకారునిగా అవతారమెత్తినట్లు చెప్పారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎంఎల్‌సిగా తనను గెలిపిస్తే నిరుద్యోగ పట్టభద్రుల సమస్యలపై పోరాడుతానని చెప్పారు. అనంతరం జిల్లా పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లేవని, వాటిపై ఎలా స్పందిస్తారని ఓ పత్రికా జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ పెద్ద ఎత్తున స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తానని, దీనిపై పట్టభద్రులను ఏకం చేసి పరిశ్రమల వారితో మాట్లాడి, వారందరినీ తీసుకుని ప్రభుత్వ పెద్దలను కలిసి ఉపాధి అవకాశాల కోసం కృషి చేయనున్నట్లు చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు అజీం తదితరులున్నారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించండి



**ప్రజాపక్షం/ఖమ్మం/మణుగూరు :** మణుగూరు సింగరేణి ఓసి టు లో హిందుస్థాన్ ట్రేడ్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కార్మికులను 12 గంటలు శ్రమ చేయిస్తూ కేవలం ఎనిమిది గంటల వేతనం కూడా చెల్లించడం లేదని అడిగితే వారి జీతాలను నెలకు 1000 లేదా 2000 రూపాయల చొప్పున కోత విధిస్తూ ఇబ్బందుల గురి చేస్తున్నారని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఓసి 2 సమస్యలను ఏఐటీయూసీ నాయకులు జిఎం దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేదని, ఓ,టీ . (ఓవర్ టైం)చేస్తున్న కార్మికులకు అదనపు వేతనం చెల్లించటం లేదని, కనీసం భోజనం వసతి కూడా లేదని ప్రతి సంవత్సరం దీపావళికిచ్చే బోనస్ కూడా చెల్లించడం లేదని అన్నారు. ఆడిగిన కార్మికులపై కక్ష సాధింపు చేస్తున్నారని మణుగూరు సింగరేణి జి.ఎం. దుర్గం రామచందర్‌కి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మి నారాయణ, బ్రాంచి ఉపాధ్యక్షులు రాంనర్సయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నాడు సాయంత్రం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించి వారికి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందుస్థాన్ ట్రేడ్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్మికుల సమస్యలపై జిఎం. జి సుబ్బారావుకు సమస్యలను మూడు నెలల క్రితం నుండి వివరించినప్పటికీ ఏ మాత్రం స్పందన లేదని ఇంకా వేధింపులు ఎక్కువయ్యాయని కార్మికుల పట్ల కక్ష సాధింపు దిగుతున్నారని ఇది సరైన పద్ధతి కాదని, యాజమాన్యం తన విధానం మార్చుకోవాలని సూచించారు. కార్మికుల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రతి నెల పే స్లిప్పు ఇవ్వకుండా నెలలో ఐదవ తేదీ లోపు జీతాలు ఇవ్వాల్సి ఉండగా, నెలలో ఎప్పుడు పడితే అప్పుడుజీతాలు చెల్లిస్తూ ఒక్కొక్కరికి, ఒక్కో విధంగా జీతంలో కోత విధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. అసలు కంపెనీలో లేకుండా కొంతమంది పేర్లను చూపిస్తూ వారు వేతనాలను కూడా కంపెనీ వారు కాజేస్తూ కంపెనీకి ఆర్థికంగా నష్టం వచ్చే విధంగా చేస్తున్నారని, వారి బర్డెన్ కూడా కార్మికుల మీద పడుతుందని వారు అన్నారు. ఎండలు విపరీతంగా పెరగడంతో కనీసం కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు కూడా ఇవ్వడం లేదని వారు అన్నారు. ఇప్పటికైనా సంబంధిత సింగరేణి అధికారులు స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని, మణుగూరు సింగరేణి జిఎం దృష్టికి తీసుకెళ్లామని వారు వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి జి వెంకటేశ్వర్లు (జి.వి), గౌరవ అధ్యక్షులు తోట రమేష్, ఉపాధ్యక్షులు ఆదెర్ల సురేందర్, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, హిందుస్థాన్ ట్రేడ్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఐటియుసి) అధ్యక్లులు అవినాష్, కార్యదర్శి జావిద్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో లాలాపురంలో మత్స్య శాఖ, మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మత్స్య సహకార సంఘం అధ్యక్షులు షేక్ రహీం మాట్లాడుతూ మత్స్యకారుల పిల్లలు ఏ రంగంలోను తక్కువ కాదు అని, మొన్న ఇంటర్ ఫలితాల్లో కూడా మన మత్స్యకారుడి బిడ్డ అత్యధిక మార్కులు సాధించిందని అన్నారు. మత్స్యకారుల కుటుంబంలో నుంచి మన పిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని ప్రతి ఒక్క మత్స్యకారుడు తమ యొక్క సభ్యత్వాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని అలాగే మత్స్యకారులకు వర్తించే భీమా, పథకాలు అన్నింటికి ఇది ఎంతగానో అండగా ఉంటుందని తెలియజేశారు. అదే విధంగా వైరా చెరువులో చేపల వేటకు అతి త్వరలోనే దిగుదామని నీళ్ళు తక్కువగా ఉన్నందున వేటకు వెళ్లడం కుదరదని, అందుకు గాను జూన్ మొదటి వారంలో చేపల వేటకు దిగుటకు అందరూ సిద్ధంగా ఉండాలని సంఘ సభ్యులందరికి సూచించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## హరీష్‌కు నివాళి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన ఉల్లోజు హరీష్(28) మరణించడంతో విషయం తెలుసుకొన్న జెడ్‌పిటిసి దంపతులు కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డిలు మృతుని నివాసానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, దహన సంస్కారాల ఖర్చులకు నిమిత్తం రూ 10వేలను ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నివాళులర్పించిన వారిలో బిఆర్ఎస్ పార్టీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్సం వెంకన్న, మాజీ ఉపసర్పంచ్ చిన్న మల్లయ్య, పార్టీ నాయకులు బొద్దకల సహదేవు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కొనేట్టు లేదు.. పచ్చడి పెట్టేటట్టు లేదు...



**ప్రజాపక్షం/చండ్రుగొండ:** గతంలో గ్రామాలలో రైతులు, ప్రజలు మామిడికాయ పచ్చడి సీజన్ వచ్చిందంటే సందడి వాతావరణం నెలకొనేది. వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుకోవడంతో మామిడికాయ పచ్చళ్లు మధ్యతరగతి వారు, పేదవాళ్లు పెట్టేటట్టు లేకుండా పోయింది. ఇటీవల గాలి దుమారానికి మామిడికాయలు నేలరాలడంతో మామిడికాయల రేటు ఆకాశం అంటుంది. చిన్నరసాలు నాటు కాయలు ఒక్కొక్క మామిడికాయ సుమారు రూ 25 నుంచి 30 వరకు పలుకుతొంది. నిత్య వసర సరుకులు మంచి నూనె కిలో రూ 1800, వెల్లిపాయలు కేజీ రూ 300, ఆవాలు మెంతులుకు అధిక రేట్లు ఉన్నాయి. దీంతో గ్రామాలలో మామిడికాయ పచ్చళ్లు ఇప్పుడు తక్కువ మామిడికాయలతో పెట్టి చేతులు దులుపుకుంటున్నారు.

## ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలు



**ప్రజాపక్షం/చండ్రుగొండ:** శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 331 ఆరాధన మహోత్సవం అయ్యన్నపాలెం త్రిమూర్తుల ఆలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారాలు కృష్ణమాచారి రామలింగేశ్వరచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సోము కృష్ణమాచారి, వారాధి రామాచారి, వెంకటాచారి, రవీందర్‌రెడ్డి, నున్న వెంకటేశ్వర్లు, కిరణ్, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో పాడి ఎద్దు మృతి



**ప్రజాపక్షం/కరకగూడెం:** విద్యుత్ షాక్ తో పాడి ఎద్దు మృతి చెందిన సంఘటన శుక్రవారం కరకగూడెం మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... కరకగూడెం మండలం, కలవలనాగారం గ్రామానికి చెందిన ఇస్లావత్ రాధాకృష్ణ అనే రైతు కి చెందిన పాడి ఎద్దు సమీపంలో గల విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్దకు వెళ్ళగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో రైతు రాధాకృష్ణ కన్నీటి పర్యంతమయ్యాడు. వ్యవసాయంలో తనతో చేదోడు వాదోడుగా ఉండే సుమారు రూ. 50 వేలు విలువ చేసే ఎద్దు మృతి చెందిందంటూ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు..

## వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణంలోని గోల్డ్ స్మిత్ కాలనీలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ పూజల్లో ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 331వ ఆరాధనోత్సవాల్లో భాగంగా పంచహారతులు పట్టారు. అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అనుగోజు నాగభూషణం, కార్యదర్శి పెద్దోట సత్యనారాయణ, కోశాధికారి త్రివిక్రమ బ్రహ్మానందం, రాము, లలిత, వెంకటరెడ్డి, మాధవరెడ్డి, రాము, శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

# రహదారిపై బైఠాయించిన ఉపాధి కూలీలు





**ప్రజాపక్షం/కూసుమంచి :** ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలు పనికి తగ్గ వేతనం రావడం లేదని ఆందోళన చేపట్టారు. కూసుమంచి గ్రామానికి చెందిన కూలీలకు 1149 జాబ్ కార్డులు ఉండగా అందులో 969 మంది గత 8 వారాలుగా గ్రూపుల వారీగా చెరువు మట్టి పూడిక పనులు చేస్తున్నప్పటికీ తమకు సరైన వేతనాలు రావడం లేదని, దీనితో చెరువు కట్ట గంగాదేవి చెరువు సమీపంలో కూసుమంచి కిష్టాపురం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు అరకొర, చాలీచాలని వేతనాలు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో అధికారులు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకుండా అరకొర వసతులు కల్పించి చేతులెత్తిస్తున్నారని, సుమారు 500 మంది పని చేస్తున్న ప్రదేశంలో చిన్న కొద్ది టెంట్ ని ఏర్పాటు చేసి, ఒక వాటర్ క్యాన్ మాత్రమే ఏర్పాటు చేసి చేతులుదులుపుకుంటున్నారని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో వ్యవసాయ పనులన్నీ ముగియడంతో ఇతర పనులు లేక కుటుంబ పోషణ కష్టంగా మారి ఉపాధి పనులకు వస్తున్నామని కానీ ఇక్కడ మాత్రం రోజువారి కూలీ 300 చొప్పున తమ ఖాతాలో జామ అవుతాయాని చెప్పి రోజు కూలి రూ.75 నుండి 110 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని తమ గోడుని వినిపించారు. రెండు నెలలుగా డబ్బులు జమ కాకపోవడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఏపీవో అప్పారావు, పంచాయితీ కార్యదర్శి గోదాల శంకర్ లను వివరణ కోరగా పనికి తగ్గ వేతనం పడుతుందని, కూలీలు కొలతలకు తగ్గట్టు పనిచేయడంలేదని, అందువల్లనే రోజువారి కూలీ తక్కువ పడుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎంపిటిసి మాదాసు ఉపేందర్ రావు ఆందోళన ప్రదేశానికి వెళ్లి కూలీలకు నచ్చచెప్పి ఇట్టి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పి ఆందోళనను విరమింపజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు దృష్టి సారించి ఉపాధి కూలీలా సమస్యను తీర్చి కూలీ వేతనాలను రోజు 300 రూపాయల చొప్పున తమ ఖాతాలో జమ చేయాలని కూలీలు కోరుతున్నారు.

# బ్లాక్ మెయిలర్లను ఓడించండి

**-ప్రజల పక్షాన ప్రశ్నించే వారిని గెలిపించండి**
**-మీడియా సమావేశంలో**
**బిఆర్ఎస్ ఎంఎల్‌సి అభ్యర్థి రాకేష్ రెడ్డి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాజకీయాల్లో పూటకో రంగు మార్చి ఉద్యోగులను, అధికారులను, సంస్థలను, రాజకీయ నాయకులను బెదిరించి బ్లాక్‌మెయిల్ చేసే బ్లాక్‌మెయిలర్లను శాసన మండలి ఎన్నికల్లో ఓడించాలని బిఆర్ఎస్ శాసన మండలి పట్టభద్రుల అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శాసన మండలి ఎగువ సభ అని అనేక మంది గౌరవనీయ వ్యక్తులు మండలి సభ్యులుగా పని చేసి శాసన మండలికి గౌరవాన్ని తెచ్చారని అటువంటి సభకు బెదిరింపు దారులను పంపించడం సరి కాదని చైతన్యవంతులైన ఖమ్మంజిల్లా పట్టభద్రులు ఆలోచన చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక బిఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన మీడయా సమావేశంలో రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చానని రాజకీయాల్లో ఎటువంటి ఆరోపణలు లేవని స్వచ్ఛందంగా సేవ చేశానని శాసన మండలిలో కూర్చునే అర్హత తనకే ఉందని రాకేష్‌రెడ్డి తెలిపారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, యువకులు, విద్యావంతులు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని రాకేష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజల హక్కుల కోసం నిరంతరం ప్రశ్నిస్తానని అందుకు నాకు అవకాశం కల్పించాలని రాకేష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శాసన మండలి సభ్యులు జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు తాతా మధు మాట్లాడుతూ విద్యావంతుడైన రాకేష్‌రెడ్డిని గెలిపిస్తే ఉమ్మడి ఖమ్మం వరంగల్ నల్గొండ జిల్లాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఎవరి పక్కన ప్రశ్నిస్తున్నాడో ప్రజలు గ్రహించాలని కోరారు. ఈనెల 27న జరిగే ఎన్నికల్లో మూడో నెంబరుపై మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో ఖమ్మం, మధిర ఎన్నికల ఇంచార్జిలు ఆర్‌జెసి కృష్ణ, బిచ్చాల తిరుమలరావు, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, శీలంశెట్టి వీరభద్రం, బొమ్మెర రామ్మూర్తి, సుబ్బారావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# హవేలి అభివృద్ధి వెనక సిపిఎం

**-రేపు హవేలి కార్యాలయం ప్రారంభం - ఎర్ర కవాత్**
**-హాజరు కానున్న శైలజ టీచర్, తమ్మినేని**
**-మీడియా సమావేశంలో నున్నా నాగేశ్వరరావు**







**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంలో అంతర్భాగంగా ఉన్న ఖానాపురం ప్రాంత అభివృద్ధిలో సిపిఎం కీలక భూమిక పోషించిందని పలు కాలనీల నిర్మాణం, అభివృద్ధి సిపిఎం కృషి ఫలితమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. హవేలి పంచాయితీ పాలక మండలి 20 ఏళ్ల పాటు సిపిఎం చేతిలో ఉండటం సిపిఎం పోరాటాలు ఈ అభివృద్ధికి కారణమయ్యాయని ఆయన తెలిపారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నున్నా మాట్లాడుతూ ఖమ్మం నగరంలో అంతర్భాగంగా ఉండి వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి నివాసాలు ఏర్పాటు చేసుకున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా సిపిఎం ఆధ్వర్యంలో హవేలి ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. బహుళ అంతస్తుల నిర్మాణాలు, సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఇండ్ల స్థలాల కోసం సిపిఎం అనేక పోరాటాలు నిర్వహించిందని దాని ఫలితంగా పలు కాలనీలు ఏర్పడ్డాయన్నారు. విస్తరించిన హవేలి ప్రాంత ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యాలయాన్ని నిర్మించడం జరిగిందని ఈ కార్యాలయంలో ప్రజా సంఘాల కార్యకలాపాలతో పాటు గ్రంథాలయం, వైద్య శిబిరాల నిర్వహణ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే జిల్లాలో ఆరు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని ఏడవ మెడికల్ క్యాంపు ప్రారంభించ బోయే హవేలి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా 19న సాయంత్రం సిపిఎం కార్యాలయం నుండి హవేలి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ర్యాలీ అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేరళ ఆరోగ్యశాఖ మాజీ మంత్రి కె. శైలజ టీచర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరుకానున్నారని నున్నా తెలిపారు. సన్నరకం వడ్లకే బోనస్ ఇస్తామనడం సరికాదని అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని నిధుల సేకరణ పేరుతో ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు యర్రా శ్రీకాంత్, బుగ్గవీటి సరళ, వై. విక్రం, హవేలి కార్యదర్శి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మల్లు నందిని



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని బంజారాకాలనీ నందు వేంచేసియున్న శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ 15వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారికి డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి మల్లు నందిని పట్టు వస్త్రాలను సమర్పించారు. శుక్రవారం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవాలయాన్ని సందర్శించిన ఆమె ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని, బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ అధ్యక్షులు మల్లాది వాసు, సవిత, కాంగ్రెస్ నాయకులు రంగా శ్రీను, రూపా, రంగా హన్మంతరావు, బోడేపూడి వీరభద్రరావు, పాటిబండ్ల సత్యంబాబు, కళ్యాణ పుల్లారావు, కాంగ్రెస్ నాయకులు ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాయల శేషగిరిరావుకు నివాళి



**ప్రజాపక్షం/ మధిర :** తల్లాడ మండలం మిట్టపల్లికి చెందిన తొలి ఎంపిపి దివంగత రాయల వెంకటశేషగిరిరావు అనారోగ్యంతో మృతి చెందిన విషయం విధితమే. శుక్రవారం మిట్టపల్లిలోని శేషగిరిరావు నివాసానికి వెళ్లిన టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాధం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిపిగా, డిసిఎంఎస్ చైర్మన్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల టిడిపి అధ్యక్ష, ఉపాధ్యక్షులు కూచిపూడి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరాజు, కల్లూరుమండల టిడిపి అధ్యక్షులు చిట్టిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం



**ప్రజాపక్షం/గుండాల :** శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 331వ ఆరాదన మహోత్సవాన్ని శుక్రవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆద్వర్యంలో అత్యంత భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని బతుకమ్మఘాట్ సమీపంలో విశ్వకర్మ పతాకాన్ని ఎగురవేసి , బ్రహ్మంగారి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి విశ్వబ్రాహ్మణ అధ్యక్షులు మాజోజు చంద్రాచారి మాట్లాడుతూ స్వామివారు జరగబోయే రుగ్మతలను ముందుగానే చెప్పిన కాలజ్ఞాని అని, ఎంతో మహిమగల బగవంతుడు అని అన్నారు. కార్యక్రమంలో వెలిశాల రవి, రమేష్, దర్గాచారి, హనుమాచారి, కె వెంకటేశ్వర్లు, వెంకటాచారి, పాపచారి, శశిధర్,సత్యం, నరేష్, రాకేష్, కిరన్ , శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలు తొలగించి సైడ్ కాల్వలు పూడికతీత



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండల కేంద్రమైన సింగరేని గ్రామపంచాయతీలో మెయిన్ రోడ్డుపై రెండు సంవత్సరాల క్రితం ఆక్రమణలు తొలగించి సైడ్ కాల్వలు పూడిక తీయడం జరిగింది. సైల్ కాల్వలకు దాదాపు పది చోట్ల రహదారులు ఉండగా ఆ రహదారుల క్రింద నుండి మురుగునీరు వెళ్లేందుకు అధికారులు ఇప్పటికి చర్యలు తీసుకోకపోవడంతో గత రెండు సంవత్సరాల నుండి కాల్వల్లో నీరు నిలిచి దుర్గంధం వస్తుంది. అంతేకాదు ఆ రహదారిపై ఉన్న ప్రజలు చివరకు దోమలతో కూడి సహవాసం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పత్రికల్లో కథనాలు వచ్చినా ఎవరూ స్పందించడం లేదు. మళ్లీ ఇప్పుడు వర్షాకాలం వస్తుందంటేనే ఈ కాల్వల వలన చిన్న పిల్లలకు, వృద్ధులకు ఎలాంటి రోగాలు వస్తాయేమోనని భయం వేస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారిపై సైడ్ కాల్వల నుండి మురుగునీరు ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. పాత్రికేయ మిత్రులు కూడా కాస్త చొరవ తీసుకోవాలని కోరారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించండి





ప్రజాపక్షం/వైరా: బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. రాబోయే నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి విజయానికి పాటుపడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 150 రోజులు గడుస్తున్న నేటికి సంక్షేమ పథకాలు అమలు జరగడం లేదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో గత పది సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. రైతులు పేదలు సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు. రాబోయే ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఓటర్స్‌ను టిఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేసేవిధంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఖమ్మం ఎంపి అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపు ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, కట్టా కృష్ణార్జున్‌రావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, వనమా విశ్వేశ్వరరావు, మాదినేని ప్రసాద్, భూమాత క్రిష్ణమూర్తి, కొత్తా వెంకటేశ్వరరావు, కిలారి కిరణ్, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, ఆదూరి ప్రేమ్, దొంతెబోయిన గోపి, విలాసాగరం నరేష్, కారుకొండ బోస్, నూకల ప్రసాద్, కామినేని శ్రీనివాస్‌రావు, చక్రవర్తి, తడికమళ్ళ నాగేశ్వరరావు, ఇలారపు వాసు, బట్టా భద్రయ్య, పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి




ప్రజాపక్షం/వైరా: జిల్లాలో అకాల వర్షంతో పంటలు , పండ్లు, కూరగాయాల తోటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వైరాలో విక్రమ్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ ఖమ్మం జిల్లాలో 11 మండలాల్లో 548మంది రైతులకు చెందిన 2000 ఎకరాల్లో మామిడి తోటలు, బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయని, అదేవిధంగా ఇండ్ల రేకుల షెడ్లు కుప్పకూలాయని, విద్యుత్ తీగలు వ్రేలాడం వలన పశువులు మృతి చెందాయని ఆయన అన్నారు. ఈ అకాల వర్షానికి నష్టపోయిన రైతాంగాన్ని , పేదలను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మే19, 20 తేదీల్లో వైరాలో మిట్టపల్లి ఫంక్షన్ హాల్‌లో సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం జిల్లా రాజకీయ తరగతులు నిర్వహిస్తున్నామని ఎంపిక చేసిన ప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సివై.పుల్లయ్య, పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి కె.అర్జున్‌రావు, పార్టీ వైరా మండల కార్యదర్శి యలదండి బాబు పాల్గొన్నారు.

# బదిలీలకు అధికారుల యత్నం

**- ఎంపి ఎన్నికల ఫలితాల తర్వాత బదిలీలు**
**- ప్రజాప్రతినిధుల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు**

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : అధికారులు బదిలీల కోసం ఎదురు చూస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత బదిలీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. దింతో అధికారులు ఇప్పట్నుంచే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఐఎఎస్, ఐపిఎస్‌లతో పాటు జిల్లా పని చేసే తహశీల్దార్ల నుండి మొదలు ఎస్సైల వరకు బదిలీలు జరగనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇతర జిల్లాల నుండి ఈ జిల్లాకు వచ్చిన అధికారులు సొంత జిల్లాలతో పాటు ఇతర జిల్లాలకు బదిలీ కోసం ఎదురు చూస్తున్నారు. జరిగే ప్రతీ బదిలీ ప్రజా ప్రతినిధుల సిఫార్సుతో జరగనుండటంతో అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారి లెటర్ హెడ్స్‌పై సిఫార్సు లేఖలు తీసుకోవడం తోపాటు తమకు దగ్గరగా ఉన్న అధికారుల సహకారంతో తమకు అనుకూలంగా ఉన్న జిల్లాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు తీవ్రతరం చేశారు.



**అసెంబ్లీ ఎన్నికల ముందు భారీగా బదిలీలు...**

ఎన్నికల కమీషన్ ఆదేశాలకు అనుగుణంగా గత శాసనసభ ఎన్నికల సమయంలో పెద్దఎత్తున బదిలీలు చేశారు. తహశీల్దార్, ఎస్సై మొదలుకుని ఆర్‌డిఓ, డిఎస్‌పిలతో పాటు ఎస్‌పి, కలెక్టర్‌లతో సహా బదిలీలు జరిగాయి. పార్లమెంట్ ఎన్నికల సమయంలో సొంతజిల్లాల్లో ఇతర ఉద్యోగులను కూడా ఎన్నికల కమీషన్ ఆదేశాను సారం అక్కడ్నుంచి బదిలీ చేశారు. వీరిలో మూడేళ్ల సర్వీసు పూర్తయిన వారు, ప్రధాన పోస్టుల్లో ఉన్న వారు సైతం ఉన్నారు.

**సొంత జిల్లాలకు ...**

శాసనసభ తో పాటు లోక్‌సభ ఎన్నికలు కూడా పూర్తయ్యాయి. జూన్ 4వ తేదిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు సైతం రానున్నాయి. అనంత రం బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలియడంతో బదిలీలపై వెళ్లిన వా రు ఎక్కువ మంది సొంత జిల్లాలకు బదిలీ చేయించుకునేందుకు చూస్తున్నారు. కొందరికి పదోన్నతులు ఉండటంతో, ప్రస్తుతం పనిచేసే ప్రదేశంలో ఇబ్బందిగా ఉన్న వారు ఈ ప్రయత్నాలను ముమ్మరం చేసుకుంటున్నారు. కాగా ప్రభుత్వం స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటే మాత్రం మరికొన్ని రోజుల పాటు ఎక్కడి వారు అక్కడే పనిచేయాల్సి ఉంటుంది.

# సింగరేణి కార్మికులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాపక్షం/ఖమ్మం/మణుగూరు : కొత్తగూడెం ఇల్లందు ఏరియాల నుంచి ప్రతిరోజు మణుగూరు ఏరియాకు వస్తున్న సింగరేణి కార్మికులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మణుగూరు ఏరియా టి బి జి కె యస్ ఇన్ చార్జి నాయకులు నాగెల్లి, టి బి జి కె యస్ నాయకులు మణుగూరు డిపో మేనేజర్ టి.స్వామికు వినతి పత్రాన్ని అందజేశారు. కొత్తగూడె, ఇల్లందు ఏరియా ల నుంచి మూడు షిఫ్ట్ లలో 300 మందికి పైగా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి విధులకు హాజరవుతున్నారని, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి రావడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మణుగూరు ఏరియా నుంచే రోజువారీగా విధులకు హాజరు కావాలని ఇటీవల యాజమాన్యం నోటీస్ ద్వారా కార్మిక వర్గానికి తెలియ చేయడంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాగెల్లి, బంగారు పవన్ కుమార్, మునిగెల నాగేశ్వరరావు, సమర్పన్, గుగులోతు రమేష్, రవి, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కారు అదుపు తప్పి బోల్తా.. వ్యక్తి మృతి



ప్రజాపక్షం/కూసుమంచి : కారు అదుపుతప్పి బోల్తా పడటంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఖమ్మం సూర్యాపేట జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం నగరంలోని శ్రీ నగర్ పోలీస్ కాలనీకి చెందిన వడ్లమూడి వెంకటేశ్వర్లు (50) అనే వ్యక్తి హైదరాబాద్ నుండి ఖమ్మం వెళ్తుండగా కూసుమంచి మండలం జీళ్ళచెరువు వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడడంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. గేదె అడ్డు రావడంతో తప్పించబోయి డివైడర్ కు బలంగా ఢీకొనడంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారిని ప్రసూన రాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గం.లకు జరిగే ఈ సమావేశానికి జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, కో అప్షన్ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, శాశ్వత ఆహ్వానితులు, సంబంధిత జిల్లా అధికారులు హాజరు కావాలని సూచించారు.

# తమలపాకుల చెట్టుకు ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/భద్రాచలం : నియోజకవర్గం పరిధిలోని దుమ్ముగూడెం మండలం పెద్దనల్లబెల్లి గ్రామంలో తమలపాకుల చెట్టుకు కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన రాము తన ఇంట్లో గత కొన్నేళ్ళ క్రితం తమల పాకుల చెట్టును పాతాడు. దానిని తన బిడ్డలతో సమానంగా చూసుకుంటూ దానికి కావాల్సిన పోషణను అందిస్తున్నాడు. ఈ చెట్టు ఏకంగా 70 అడుగులు పై బడి పెరిగిపోయింది. దీంతో చెట్టు ఏపుగా పెరగడంతో పాటు ఆకులు సైతం మోదుగు ఆకుల సైజులో పెరిగిపోయాయి. గత కొంతకాలంగా చెట్టుకు పసుపు, కుంకుమలు అద్ది పూజలు చేస్తుండటంతో గ్రామస్తులంతా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. పలువురు ఆచెట్టు వద్దకు చేరుకుని అక్కడి సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు మక్కువ చూపుతున్నారు. చెట్టును తన కన్నబిడ్డలా చూసుకుంటున్న ఆ ఆలుమగలను పలువురు ప్రశంశిస్తున్నారు.

# అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ప్రజాపక్షం/కొణిజర్ల : అకాల వర్షంతో పంటనష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిలభారత ప్రగతిశీల రైతుసంఘం కొణిజర్ల మండల కార్యదర్శి కోయిడ లక్ష్మీ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతు మండలంలోని గుబ్బగుర్తి , ఉప్పలచలక , పెద్దగోపతి , చిన్నమునగాల , కాచారం గ్రామాల్లో అకాల వర్షానికి తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. బొప్పాయి, మామిడి దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. విద్యుత్ తీగలు కిందకు వేలాడటం విద్యుత్ షాక్‌కు పశువులు మృతిచెందినట్లు తెలిపారు. నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం మండల అధ్యక్షుడు మేడి కొండలరావు , రైతుసంఘం సీనియర్ నాయకులు వడ్డే సత్యం , గోగుల వెంకన్న , భూక్యా మత్రు తదితరులు పాల్గొన్నారు.

# పోడుభూములు కొట్టించడంలో భీమ్‌సింగ్ పాత్ర ఎనలేనిది



ప్రజాపక్షం/కొణిజర్ల : గిరిజనలు పోడుభూములు కొట్టించడం వాటిని సాధించడంలో భూక్యా భీమ్‌సింగ్ పాత్ర ఎనలేదని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న కొనియాడారు. మండల పరిధిలోని విక్రమ్‌నగర్‌లో భూక్యా భీమ్‌సింగ్ సంస్మరణసభ శుక్రవారం జరిగింది. ఈసభలో ఆయన మాట్లాడుతు సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాలకు ఆయన నాయకత్వం వహించేవాడని కొనియాడారు. కడవరకు న్యూడెమొక్రసీ జెండా వదలకుండా ఎర్రజెండానీడలోనే కొనసాగాడని అన్నారు. సారా వ్యతిరేక ఉద్యమంలో కూడా ఆయన కీలకపాత్ర పోషించాడని అన్నారు. భూపంపకంలో , ఇండ్ల నిర్మాణంలో పాలు పంచుకున్నాడని పేర్కొన్నారు. లకావత్ భాషా అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ వైరా సబ్‌డివిజన్ కమిటి కార్యదర్శి షేక్ ఖాసిం , రైతుకూలీసంఘం రాష్ట్ర నాయకులు ఎస్‌కె ఉమర్ , ప్రగతిశీల మహిళా సమాఖ్య సంఘం జిల్లా అధ్యక్షురాలు పరకాల లక్ష్మి , గ్రామ నాయకులు గుగులోత్ బాబు , ఇస్లావత్ కృష్ణ , ధరావత్ మంగయ్య, లకావత్ బాసు , ఇస్లావత్ శ్రీను , ధరంసోత్ ఫూల్‌సింగ్ , ధరావత్ రామ్‌లాల్ , గుగులోత్ మంగ్లీ , ఇస్లావత్ బాజు , విక్రమ్‌నగర్ గ్రామస్థులు పాల్గొన్నారు.